క్లుప్తంగా

మూడు రోజులు నీటి సరఫరాకు అంతరాయం

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డులో ప్రధాన రహదారిపై కల్వర్టు నిర్మాణంలో భాగంగా పైప్‌లైన్ పనులు జరుగుతున్నందున ఆది, సోమ, మంగళ వారాల్లో మంచినీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. పనులు జరుగుతున్న ప్రాంతాలైన పెద్దబండ, కేశరాజుపల్లి, అలకాపురి, మిర్యాలగూడ రోడ్డు కాలనీల్లో మంచినీటి సరఫరా జరగదని అన్నారు. ఆయా కాలనీవాసులకు ప్రత్యామ్నాయంగా ట్యాంకుల ద్వారా మంచినీరు సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని 5వ వార్డు దుర్గాకాలనీ, గరుడాద్రి కాలనీ, శ్రీనివాస కాలనీల్లో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నాయకుడు కంచర్ల ఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ ఈ శిబిరంలో కాలనీవాసులకు అవసరమైన కంటి పరీక్షలను కంటి నిపుణులతో చేయించామని తెలిపారు. అనంతరం డాక్టర్ అగర్వాల్ ఆస్పత్రి సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో హరికృష్ణ, అంకం శంకర్, అంకం శివప్రకాష్, గోపాల్, జానయ్య, జక్కల లలిత, సంతోష్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి


మొక్కనాటి నీళ్లు పోస్తున్న ఎంపీ లక్ష్మణ్

నల్లగొండ టూటౌన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. ప్రధాని మోదీ 11 సంవత్సరాల పాలన పూర్తయిన సందర్భంగా శనివారం నల్లగొండలోని పానగల్ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో పానగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు గోలి సురేఖ స్మారకార్థం గోలి మధుసూదన్‌రెడ్డితో కలిసి మొక్కలు నాటి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి, శ్యాంసుందర్, మిరియాల వెంకటేశం, కంచర్ల విద్యాసాగర్ రెడ్డి, మంగళపల్లి కిషన్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర కన్వీనర్‌గా జక్కుల శ్రీనివాస్‌యాదవ్

నల్లగొండ టౌన్: అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర మాజీ సైనికుల విభాగం కన్వీనర్‌గా జక్కుల శ్రీనివాస్‌యాదవ్‌ను నియమిస్తూ అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవీంద్రనాథ్‌యాదవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్ శనివారం హైదరాబాద్‌లో నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర యువజన అధ్యక్షుడు గొర్ల యశంత్‌రాజుయాదవ్, వినోద్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు

నకిరేకల్ : తనను కులం పేరుతో దూషించి భయపెట్టేందుకు యత్నించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, నకిరేకల్ సీఐ రాజశేఖర్‌లపై చర్యలు తీసుకోవాలని చందుపట్ల గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు జిల్లా డాకయ్య జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. చందుపట్ల గ్రామానికి సంబంధించిన ఓ కేసు విషయంలో ఈ నెల 20వ తేదీన నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌కు వెళితే అకారణంగా పోలీసులు తనను కులంపేరుతో దూషించారని తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

కనగల్: మండల కేంద్రానికి చెందిన పగిడిమర్రి ఇద్దమ్మ(55) శుక్రవారం అర్ధరాత్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. ఆమె మృతదేహాన్ని శనివారం మాజీ జెడ్పీటీసీ చిట్ల వెంకటేశం గౌడ్ సందర్శించి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట కొంపెల్లి వెంకన్న గౌడ్, నాంపల్లి మల్లేష్ ఉన్నారు.

మన అమ్మ మన సారె

నకిరేకల్: మన అమ్మ మన సారె కార్యక్రమంలో భాగంగా శనివారం నకిరేకల్‌లోని రంగారెడ్డినగర్‌లో మిర్యాల వెంకటేశ్వర్లు–చంద్రకళ ఇంటి నుంచి వడి బియ్యం తీసుకెళ్లి అర్వపల్లి మండలం తిమ్మాపురంలో గల శ్రీ సూర్య భగవానుడి ఆలయంలో సమర్పించారు. కార్యక్రమంలో స్థానిక కనకదుర్గ ఆలయ చైర్‌పర్సన్ బ్రహ్మదేవర పద్మావతి, మన అమ్మ సారె అధ్యక్షురాలు రావిరాల కవిత, ప్రతినిధులు గర్రె రూప్సీ, చల్లా రమాదేవి, మూడుదుడ్ల వెంకటలక్ష్మి, కాసర్ల లక్ష్మి, సూదిని విజయ, సూదిని మాలతి, హేమలత, కొండ సుజాత, కరణ్ కోటి రమా, అలువాల ధనమ్మ, పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సామూహిక జన్మదిన వేడుకలు

నకిరేకల్ : జూన్ మాసంలో జన్మించిన 23 మంది రిటైర్డు ఉద్యోగులకు శనివారం నకిరేకల్ పట్టణంలోని ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం భవనంలో సామూహిక జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి శాలువాలతో సత్కరించారు. ఈ వేడుకల్లో సంఘం అధ్యక్షుడు వంటల రామలింగం, కార్యదర్శి కందుల సోమయ్య, భవన నిర్మాణ కమిటీ కన్వీనర్ వీరమల్ల రవీందర్, ప్రతినిధులు కే.భిక్షమారెడ్డి, చిక్కు రవీందర్, శివకోటి ఆంజనేయులు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బడికి పోయేదెట్లా!


కొర్లపహాడ్ మోడల్ స్కూల్ నుంచి ఆటోలో వెళ్తున్న విద్యార్థులు

- కొర్లపహాడ్‌లోని మోడల్ స్కూల్‌కు బస్సు సౌకర్యం కరువు
- అవస్థలు పడుతున్న విద్యార్థులు

కేతేపల్లి: మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో గల మోడల్ స్కూల్‌కు బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు. సమయానికి పాఠశాలకు వెళ్లలేక చదువు మానుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని విద్యార్థులు వాపోతున్నారు. విద్యార్థులు, పలు విద్యార్థి సంఘాల నాయకులు బస్సుల కోసం అధికారులకు ఎన్నిసార్లు వినతిప్రతాలు అందజేసినా పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు.

100 మందికే హాస్టల్ సౌకర్యం

కొర్లపహాడ్‌లోని మోడల్‌స్కూల్‌లో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు దాదాపు 500 మంది విద్యనభ్యసిస్తున్నారు. నకిరేకల్ నియోజకవర్గ వ్యాప్తంగా కేవలం కేతేపల్లి మండలంలో ఒకటే మోడల్ స్కూల్ ఉంది. దీంతో ఆ పాఠశాలలో చేరేందుకు విద్యార్థుల నుంచి తీవ్ర పోటీ నెలకొంది. మండలంలోని విద్యార్థులే కాకుండా సమీపంలో ఉన్న నకిరేకల్, సూర్యాపేట తదితర మండలాల నుంచి కూడా విద్యార్థులు ఈపాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలలో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు కేవలం 100 మంది విద్యార్థినులకు మాత్రమే హాస్టల్ సౌకర్యం ఉంది. మిగిలిన విద్యార్థులు ప్రతిరోజు ఇంటి నుంచి పాఠశాలకు రావాల్సిందే.

ప్రైవేట్ వాహనాలే దిక్కు

కేతేపల్లి మండలంలో 16 గ్రామాలు ఉండగా 65 జాతీయ రహదారి వెంట ఉన్న ఐదు గ్రామాలకు మాత్రమే ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది. మిగిలిన ఏఒక్క గ్రామానికి కూడా మండల కేంద్రం నుంచి బస్సు సౌకర్యం లేదు. కొర్లపహాడ్ గ్రామం హైవేపై ఉన్నప్పటికీ పాఠశాల మాత్రం బస్‌స్టేజీ నుంచి 3 కి.మీ దూరంలో వ్యవసాయ పొలాల పక్కన ఏర్పాటు చేశారు. ఇక్కడికి చేరుకోవాలంటే ఎలాంటి రవాణా సౌకర్యం లేదు. పలు విద్యార్థి సంఘాల విజ్ఞప్తి మేరకు గత ఏడాది నుంచి కేతేపల్లి, చీకటిగూడెం, ఉప్పలపహాడ్, కొప్పోలు, తుంగతుర్తి, చెర్కుపల్లి, కొండకిందిగూడెం గ్రామాల నుంచి మోడల్ స్కూల్ వరకు ఉదయం ఒక ట్రిప్పు, సాయంత్రం మరో ట్రిప్పు బస్సు సౌకర్యాన్ని ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేశారు. ఒకే బస్సు కావడంతో దాదాపు 150 మంది విద్యార్థులు కిక్కిరిసి వెళ్లాల్సి వస్తోంది. ఇక పాఠశాలకు నకిరేకల్ మండలం నోముల, వల్లభాపురం, కేతేపల్లి మండలంలోని గుడివాడ, ఇప్పలగూడెం, కాసనగోడు, బొప్పారం, కొత్తపేట గ్రామాలకు ఎలాంటి బస్సు సౌకర్యం లేదు. దీంతో వారు ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాలు ఆశ్రయిస్తున్నారు. నెల నెలా ప్రైవేట్ వాహనాలకు కిరాయి చెల్లించలేని నిరుపేద విద్యార్థులు సైకిళ్లు, కాలినడకన పాఠశాలకు వస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మండలంలోని అన్ని గ్రామాలను కలుపుతూ మోడల్ స్కూల్ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

నెలకు రూ.2వేల ఖర్చు అవుతోంది



నా ఇద్దరు కుమార్తెలు కొర్లపహాడ్ మోడల్ స్కూల్‌లో చదువుతున్నారు. పాఠశాల మా గ్రామం నుంచి ఐదు కి.మీ దూరంలో ఉంటుంది. బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోలో పంపిస్తున్నా. నెలకు రూ.2వేలు ఖర్చు చేయాల్సి వస్తుంది. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి బస్సు నడిపించాలి

– జగన్నాథం, గుడివాడ

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



నకిరేకల్ నుంచి మోడల్ స్కూల్ వరకు బస్సు నడిపించాలని నల్లగొండ ఆర్టీసీ అధికారులను కోరాం. వారు ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రజా ప్రతినిధులు సైతం స్పందించి కొర్లపహాడ్ మోడల్ స్కూల్ వరకు బస్సులు నడిపించేలా ప్రయత్నం చేయాలి. విద్యార్థుల ఇబ్బందులు తొలగించాలి.

– మమత, ప్రిన్సిపాల్

చండూరు సమగ్ర అభివృద్ధే లక్ష్యం


చండూరు : మాస్టర్‌ప్లాన్‌పై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి


నాంపల్లి : దామెరలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే

- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చండూరు : చండూరు మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధే తన లక్ష్యమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో శనివారం చండూరు మున్సిపాలిటీ అధికారులు, నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన సీనియర్ మాస్టర్ ప్లాన్ కన్సల్టెంట్ సుభానీతో కలిసి మాస్టర్ ప్లాన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై చర్చించారు. చండూరులో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా భూగర్భ మురుగునీటి వ్యవస్థ, మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు, రోడ్ల నిర్మాణం, కూడళ్ల నిర్మాణం, వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లు, నూతన మున్సిపాలిటీ పరిపాలనా భవనం, పార్కులు, షాపింగ్ కాంప్లెక్సులు, ఇతర నిర్మాణాలపై యాక్షన్ ప్లాన్ తయారు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న మూడేళ్లలో విడతలవారీగా చండూరును అభివృద్ధి చేస్తానని, ప్రభుత్వంతో మాట్లాడి నిధులు తీసుకొచ్చే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా పబ్లిక్ హెల్త్ ఎస్ఈ వెంకటేశ్వర్‌రావు, డీఈ మనోరమ, ఏఈ నాగప్రసాద్, విద్యుత్ ఏఈ గణేశ్, చండూరు నాయకులు పాల్గొన్నారు.

విజ్ఞాన సదస్సుకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

మునుగోడు: హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో గల ప్రకాశం హాల్‌లో జూలై 13న నిర్వహించనున్న గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సుకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంకు గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ కమిటీ సభ్యులు శనివారం ఆహ్వాన పత్రిక అందజేశారు. సదస్సుతోపాటు మహాత్మ చరక అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. ఆహ్వాన పత్రిక అందజేసినవారిలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ డాక్టర్ గున్నా రాజేందర్ రెడ్డి, కార్యదర్శి యానాల ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడి శ్రీనివాసులు, రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, సభ్యులు కేవీఎస్ రెడ్డి, భూమి సునీల్ తదితరులు ఉన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నాంపల్లి: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని దామెర గ్రామంలో ఆయన పర్యటించారు. ప్రతి కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం నిరుపేదలకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లు నాణ్యతతో నిర్మించుకోవాలన్నారు. గ్రామంలో ఇంకా నిరుపేదలు ఉంటే రెండు, మూడో విడతల్లో ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని, ఈజీఎస్ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కత్తి రవీందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏరెడ్ల రఘుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ పూల వెంకటయ్య, పెద్దిరెడ్డి రాజు, దామెర మాజీ సర్పంచ్ దామెర యాదగిరి, నర్సింహాచారి, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుట గ్రామస్తుల ధర్నా


నకిరేకల్ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న మంగళపల్లి గ్రామ ప్రజలు

నకిరేకల్ : గ్రామంలో ప్రజలకు సేవ చేస్తున్న నాయకుడిపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళపల్లి గ్రామానికి చెందిన ప్రజలు శనివారం నకిరేకల్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. దుష్ప్రచారం చేస్తున్న వారిని ప్రోత్సహిస్తున్న నాయకులను అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ మంగళపల్లి గ్రామ సమాచారం అందరికీ ఉపయోగపడడం కోసం మంగళపల్లి సమస్య – సంతోషం అనే వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఈ గ్రూప్‌లో కొంత కాలంగా గ్రామానికి చెందిన కందికంటి నాగబాబు అనే యువకుడు గ్రామస్తులను, ప్రజాప్రతినిధులను రెచ్చగొట్టేవిధంగా పోస్టులు పెట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నాడని ఆరోపించారు. అతడిపై చర్యలు తీసుకోవాలని సీఐ రాజశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు గొడ్డేటి సైదులు, బొల్లెద్దు లక్ష్మయ్య, గుండాల సోమయ్య, చింతల శ్రీను, నకిరేకంటి అంజయ్య బచ్చుపల్లి మునీందర్‌రావు, పూల శ్రీకాంత్ కందికంటి వనమ్మ, పాక ఐలమ్మ, నర్సింగ్ మార్తమ్మ, ఆరాల రజిత, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి


ప్రమాణ స్వీకారం చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

శాలిగౌరారం: సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని లయన్స్ క్లబ్ మల్టిపుల్ జీఎస్‌టీ కోఆర్డినేటర్ గోలి అమరేందర్‌రెడ్డి అన్నారు. శాలిగౌరారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం రాత్రి శాలిగౌరారం లయన్స్ క్లబ్ 4వ ఇన్‌స్టాలేషన్ సందర్భంగా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం నూతన అధ్యక్షుడు గుజిలాల్ శేఖర్‌బాబు, ప్రధాన కార్యదర్శి దామెర్ల శ్రీనివాసులు, కోశాధికారి గుండు పరమేశ్‌లతోపాటూ కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా ప్రతినిధులు కోటేశ్వరరావు, సతీష్‌కుమార్, శివశంకర్, సింహాద్రి, రామకృష్ణ, అశోక్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, సతీష్, శ్రీనివాసులు, లక్ష్మారెడ్డి, పాపిరెడ్డి, శ్రీనివాస్, రామ్మోహనరావు, రాంరెడ్డి, శంభులింగారెడ్డి, రామకృష్ణగౌడ్, చంద్రశేఖర్, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు బానిసలు కావొద్దు


మాట్లాడుతున్న జడ్జి మంజుల సూర్యావర్

కేతేపల్లి: విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దని నకిరేకల్ సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవా సంస్థ చైర్మన్ మంజుల సూర్యావర్ అన్నారు. నకిరేకల్ మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై శనివారం మండలంలోని రాయపురం సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో జడ్జి పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దని, క్రమ శిక్షణతో చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. అదేవిధంగా పాఠశాల దశలోనే విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి షేక్ అరీఫ్, కేతేపల్లి ఎస్ఐ సతీష్, న్యాయవాదులు బి.ప్రకాశ్‌రావు, కొండా యాదగిరి, కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ ప్రిన్సి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

అటెండర్‌ను నియమించాలి


వినతి పత్రం అందజేస్తున్న ఏఈఓలు

మునుగోడు: రైతు వేదికలను శుభ్రం చేసేందుకు అటెండర్లను నియమించుకునేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి ఇప్పించాలని కోరుతూ శనివారం మునుగోడులో రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డికి ఏఈఓలు వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా రెండేళ్లుగా రైతువేదికల నిర్వహణ ఖర్చులు ఇవ్వకపోవడంతో తమ జీతం డబ్బులు ఖర్చు పెట్టాల్సి వస్తోందని, పెండింగ్ డబ్బులు ఇప్పించేలా చొరవ చూపాలని కోరారు. వినతి పత్రం అందజేసినవారిలో ఏఈఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాలకూరి యాదగిరిగౌడ్, ఏఈఓలు వహిద్, నిఖిల్, రమేష్ తదితరులు ఉన్నారు.

గ్రామ దేవతలకు పూజలు

నార్కట్‌పల్లి : వర్షాలు సరిపడా కురవకపోవడంతో చెరువుగట్టు గ్రామంలో మాజీ సర్పంచ్ మల్ల బాలకృష్ణ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సంవృద్ధిగా కురవాలని వినాయకుడు, బొడ్రాయి, ఆంజనేయస్వామితోపాటు గ్రామ దేవతలకు స్థానిక ప్రజలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవీన్‌రెడ్డి, రమేష్, కురుమ, యాదయ్య, మల్లేష్, మల్లయ్య, లింగయ్య, శంకర్, సోమనారి, నర్సింహ, మధు, పరమేష్, అశోక్, వెంకన్న, మహేష్ పాల్గొన్నారు.


మహిళకు గాయాలు

మర్రిగూడ: మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల మర్రి వృక్షం కొమ్మ శనివారం మధ్యాహ్న సమయంలో అకస్మాత్తుగా విరిగి అక్కడే ఉన్న ఆటోపై పడింది. సమీపంలో శివన్నగూడకు చెందిన మహిళ కూర్చొవడంతో గాయపడింది. గమనించిన స్థానికులు ఆ మహిళను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ : పట్టణంలోని పలు కాలనీల్లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ వేణుగోపాలచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశం బజార్ సబ్ స్టేషన్‌లో 11కేవీ ఓల్డ్ సిటీ డ్యామేజ్ అండర్ గ్రౌండ్ కేబుల్ మార్పే పనులు జరుగుతున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. పనులు జరిగే ప్రాంతాలైన మిర్యాలగూడ రోడ్డు, ప్రకాశం బజార్, మాన్యంచెల్క, కోర్టు, జెడ్పీ ఆఫీస్, మున్సిపాలిటీ, రిజిస్ట్రేషన్ ఆఫీస్, నటరాజ్ థియేటర్ రోడ్డు, మహేంద్ర ఆయిల్‌మిల్, పీవీఎస్ థియేటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నందున ఆయా కాలనీల ప్రజలు సహకరించాలని కోరారు.

దండకు.. దండానికి నోచుకోని మాజీ ప్రధాని



సరళీకృత విధానాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన గొప్ప వ్యక్తి మాజీ ప్రధాని పీవీ నరసింహారావు. శనివారం పీవీ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఉన్న పంచతత్వ పార్కులోని ఆయన విగ్రహం దండకూ.. దండానికీ నోచుకోలేదు.
– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతున్న బీజేపీ


శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న అబ్బాస్

నార్కట్‌పల్లి : పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తుంగలో తొక్కుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ.అబ్బాస్ ఆరోపించారు. నార్కట్‌పల్లిలో జరుగుతున్న నకిరేకల్ నియోజకవర్గ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ ఉన్న ఉద్యోగాలను తగ్గిస్తూ సామ్రాజ్యవాదులు, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని అన్నారు. జూలై 9వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు ఇస్తోందన్నారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, విజ్ఞాన అధ్యక్షుడు తాటి రమేష్ శిక్షణ తరగతులను కొనసాగించారు. పి.సైదులు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీల, బొంతల చంద్రారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు నగేష్, చిన్న వెంకులు, వెంకటేశ్వర్లు, శంకరయ్య, మహేష్, బయ్యన్న, వెంకటేశ్వర్లు, జిట్టా సరోజ, పెద్దులు, మారయ్య, మల్లయ్య, రవి, శంకర్, మహేశ్వర్, సైదులు, నాగరాజు, ఐలయ్య పాల్గొన్నారు.

అనుమతి లేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి


ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

రామగిరి(నల్లగొండ) : అనుమతి లేని ఇంటర్మీడియట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జిల్లా ఇంటర్మీడియట్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల శివకుమార్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఒకే బిల్డింగ్‌లో అనుమతి లేకుండా కాలేజీలు, హాస్టళ్లు నడిపిస్తున్నారని ఆరోపించారు. అనుమతి లేని కాలేజీల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఐఈఓకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కందుల విజయ్‌కుమార్, అల్లంపల్లి కొండన్న సెంట్రల్ కమిటీ మెంబర్ కొండేటి నరేష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి బాకీ తరుణ్, వినోద్ చారి, చింతల శివ, నూకతోటి మహేష్, నాగరాజ్, కిన్నెర సిద్దు, బరపాటి రమేష్, పట్టణ అధ్యక్షుడు పరశురాం, పార్థు, చరణ్, సాయి, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

పొలాలకు వెళ్లే రోడ్డుకు మోక్షం

రామగిరి (నల్లగొండ): నల్లగొండ మండలం పెద్ద సూరారం గ్రామంలో రైతులు వ్యవసాయ పంట పొలాలకు వెళ్లే రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. గ్రామంలోని తుమ్మలచెరువు నుంచి గుమ్మల బండ–పజ్జూరు లింకు రోడ్డు వరకు వెళ్లేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు గుంతలతో ఈ ప్రాంతం గుండా పంట పొలాలకు వెళ్లేందుకు రైతులు అనేక అవస్థలు పడ్డారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయించారు. నిధులు మంజూరైన వెంటనే అధికారులు 3 కిలోమీటర్ల పాటు తుమ్మలచెరువు నుంచి పజ్జూరు లింక్ రోడ్డు వరకు మట్టి రోడ్డు వేయించారు. దీంతో ద్విచక్ర వాహనాలతోపాటు ట్రాక్టర్లు, ఆటోలు, ఎడ్ల బండ్లు, అరకలు వెళ్లడానికి అవకాశం ఏర్పడింది.

‘ఉపాధి’ పథకంతో పండ్ల తోటలకు ఊతం

- అర్హులకు ఉచితంగా మొక్కలు
- మూడేళ్ల వరకు నిర్వహణ ఖర్చులు కూడా భరించనున్న ప్రభుత్వం


యరగండ్లపల్లిలో సాగవుతున్న మునగ తోట

మర్రిగూడ: రైతులు అధిక ఆదాయం ఆర్జించడమే లక్ష్యంగా జిల్లాలో ఉద్యాన పంటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. చిన్న, సన్నకారు రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రణాళికలు రూపొందిస్తోంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకానికి రైతులకు ప్రోత్సాహం అందిస్తున్నారు.

గత ఏడాది 47 ఎకరాల్లో సాగు..

గత ఏడాది మర్రిగూడ మండల వ్యాప్తంగా 47 ఎకరాల్లో 32 మంది రైతులు ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటలు సాగుచేశారు. ఈ ఏడాది అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించడంతో రైతులు పండ్ల తోటల పెంపకానికి ఉత్సాహం చూపిస్తున్నారు. సన్న, చిన్నకారు రైతులకు వర్తించే ఈ పథకంలో పండ్ల తోటల సాగుకు అయ్యే ఖర్చును మూడు సంవత్సరాలపాటు ఉపాధి హామీ నిధుల నుంచి వెచ్చిస్తున్నారు. మొక్కల కొనుగోలు, గుంతలు తీయడం, పాదులు నిర్మించడం, మొక్క నాటడం ఇలా అన్ని పనులను ఉపాధి హామీ పథకంలోనే కూలీలతో చేయిస్తారు. లబ్ధిదారుడు ఉపాధి హామీ జాబ్‌కార్డు, భూమి పట్టా పాస్ పుస్తకం జిరాక్స్ పత్రాలతో దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిశీలించి మంజూరు చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ చిన్న, సన్నకారు రైతులు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పండ్ల తోటలను సాగు చేసేందుకు అధికారులు వంద శాతం సబ్సిడీ అందిస్తున్నారు. గుంతలు తీయడం మొదలు మొక్కలు నాటడం, ఊత కర్ర కట్టడం, మొక్కల కొనుగోలు, ఎరువులు వేయడానికి, నెలనెలా పర్యవేక్షణ ఈవిధంగా మూడేళ్ల వరకు వంద శాతం సబ్సిడీని ఉపాధి హామీ పథకం ద్వారా ఇవ్వనున్నారు. మున్సిపాలిటీలు మినహా గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ చిన్న, సన్నకారు రైతులు పండ్ల తోటల సాగుకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా ప్రభుత్వం నిర్ణయించింది.

అర్హులకు మంచి అవకాశం

దరఖాస్తు చేసుకున్న వారిలో నుంచి అర్హులను రైతులను ప్రభుత్వం ఎంపిక చేస్తుంది. రైతులు తమ తోటలో బత్తాయి సాగు చేయాలనుకుంటే ప్రభుత్వం ఎకరానికి రూ.15,036 చొప్పున మూడు సంవత్సరాలకు మొత్తం రూ.45,108 ఇస్తుంది. నిమ్మకు ఎకరానికి రూ.16,540 చొప్పున మూడు సంవత్సరాలకు రూ.49,620, అదేవిధంగా మామిడికి ఎకరానికి రూ.10,525 చొప్పున మూడేళ్లకు రూ.31,575, తైవాన్ జామ తోటలకు సంవత్సరానికి రూ.36 వేల చొప్పున మూడేళ్లకు రూ.1.08 లక్షలు, సీతాఫలం తోటలకు సంవత్సరానికి రూ.2005 చొప్పున మూడేళ్లకు రూ.6015, డ్రాగన్ ఫ్రూట్ 0.5 ఎకరానికి సంవత్సరానికి రూ.36వేల చొప్పున మూడేళ్లకు రూ.1.08 లక్షలు, కొబ్బరి బ్లాక్ ప్లాంటేషన్ ఎకరానికి రూ.10,525 చొప్పున మూడేళ్లకు రూ.31,575, మునగ తోట పెంపకానికి ఎకరానికి సంవత్సరానికి రూ.36వేలు, సపోట సంవత్సరానికి ఎకరానికి రూ.9016, కొబ్బరి బండ్ ప్లాంటేషన్ ఎకరానికి సంవత్సరానికి రూ.6014 చొప్పున మూడేండ్లకు రూ.18,042 అందించనుంది.

245 మామిడి మొక్కలు పెట్టాను



గతేడాది మూడున్నర ఎకరాల్లో 245 మామిడి మొక్కలు పెట్టాను. వాటికయ్యే ఖర్చులు కూడా ఉపాధిహామీ పథకం ద్వారా పొందాను. మొక్కల నిర్వహణ ఖర్చులు కూడా మూడేళ్ల వరకు వస్తాయని అధికారులు తెలిపారు.

– నారెడ్డి వెంకట్‌రెడ్డి, రైతు, దామెరభీమనపల్లి

అర్హులు సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధిహామీ పథకం ద్వారా రైతులకు పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహకంగా అందిస్తోంది. పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి కలిగి అర్హత ఉన్న రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. లబ్ధిదారులు ఈ పథకాల ద్వారా ఆర్థికంగా స్థిరపడవచ్చు.

– వివేక్ సాగర్, ఇన్‌చార్జ్ ఏపీఓ